సేవా పథం.. స్ఫూర్తిదాయకం..

- కుష్టు వ్యాధిగ్రస్తులకు ఆసరా
- వైద్యం, పునరావాసం ఏర్పాటు
- పేదలకు చికిత్సలు
- నేడు వివేకానంద ఆరోగ్య కేంద్రం, చారిటబుల్ క్లినిక్ వార్షికోత్సవం


వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రంలోని కుష్టు వ్యాధిగ్రస్తుల పునరావాస కేంద్రం

రాజమహేంద్రవరం రూరల్: కొన్ని వ్యాధులు సోకిన బాధితులను లేనిపోని భయాలతో సమాజం దూరం పెడుతుంది. వారికి సాయం చేయడానికి భయపడుతుంది. దీంతో బాధితులు తీవ్ర మానసిక ఆవేదనకు గురవుతారు. అటువంటి వాటిలో కుష్టువ్యాధి ముఖ్యమైంది. ఈ వ్యాధి సోకిన బాధితులు కొన్నిసార్లు కుటుంబ సభ్యుల ఆదరణ కూడా కోల్పోతారు. ఇలాంటి వారిని చేరదీసి, ధైర్యం చెప్పి, ఆరోగ్యాన్ని కుదుటపర్చడంలో బొమ్మూరులోని వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం సేవలు ఎనలేనివి. ఈ కేంద్రంలోని కుష్టు వ్యాధిగ్రస్తుల పునరావాస కేంద్రం 49 ఏళ్లు పూర్తి చేసుకుంది. అలాగే పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న వివేకానంద చారిటబుల్ క్లినిక్‌కు 24 వసంతాలు పూర్తయ్యాయి. పునరావాస కేంద్రం, చారిటబుల్ క్లినిక్ విజయవంతంగా నడిచేందుకు రాజమహేంద్రవరం, పరిసర ప్రాంతాల దాతలు ఎంతో సహకరిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం పునరావాస కేంద్రం, చారిటబుల్ క్లినిక్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

వసతుల కల్పన

కుష్టు వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం కుదుట పరిచి, వారికి పునరావాసం కల్పించాలన్న ఉద్దేశంతో స్వర్గీయ డాక్టర్ మండవిల్లి మల్లికార్జునరావు, ఆనాడు కళాశాల విద్యార్థి రమేష్ కుమార్ జైన్ 1975లో వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం స్థాపించారు. వ్యాధి బాధితులు, వారి పిల్లలు సుమారు వంద మందికి ఆశ్రయం కల్పించారు. వారి సేవాతత్పరతను గమనించిన అప్పటి జిల్లా కలెక్టర్ స్వర్గీయ యూబీ రాఘవేంద్రరావు.. బొమ్మూరులోని 11 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. నివాసం ఉండడం కోసం పాకలు, బోర్‌వెల్, వాటర్ ట్యాంక్ నిర్మాణానికి అవసరమైన నిధులను కూడా సమకూర్చారు. అప్పటి నుంచి కుష్టు వ్యాధిగ్రస్తులు, వారి పిల్లలకు నివాసం, వైద్య సదుపాయం, భోజనం తదితర అవసరాలను తీర్చుతున్నారు. వారి పునరావాసానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.


వివేకానంద చారిటబుల్ క్లినిక్



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ పుల్లారావు

విశాలమైన ఆవరణ

పునరావాస కేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తులకు విశాలమైన ఆవరణ ఏర్పాటు చేశారు. ఆరోగ్యకర వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వ్యాధిగస్తులు శారీరకంగా, మానసికంగా ఉత్సాహంగా ఉండేలా చూస్తున్నారు. వ్యవసాయ పనులు, సాంస్కృతిక కార్యక్రమాలు తదితర వాటిని నిర్వహిస్తున్నారు.


సూర్యదేవాలయంలో పూజలు చేస్తున్న పునరావాస కేంద్రం వాసులు

అందుబాటులో వైద్యం

కేంద్రంలోని రోగులతో పాటు పరిసర గ్రామాల్లోని ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వివేకానంద చారిటబుల్ క్లినిక్ పేరుతో అవుట్ పేషెంట్ క్లినిక్‌ను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నారు. క్లినిక్‌కు వచ్చే రోగుల నుంచి చీటీ కోసం కేవలం రూ.10 వసూలు చేస్తారు. ల్యాబ్ పరీక్షలకు ఫీజును 40 శాతం మాత్రమే తీసుకుంటున్నారు. ఇలా వేలాది మందికి 24 ఏళ్లుగా వైద్యసేవలు అందిస్తున్నారు. విశ్రాంత ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ కలగల పుల్లారావు ప్రతి రోజు ఉదయం 9 నుంచి రాత్రి 7 గంటల వరకు స్వచ్ఛందంగా వైద్య సేవలు అందిస్తున్నారు. ఇక్కడ భారతమాత ఇలవేల్పు వివేకానంద గో నిలయం పేరున 30 గోవులతో ఒక గోశాల నిర్వహిస్తున్నారు.

సూర్యదేవాలయం

కేంద్రంలో సూర్యదేవాలయం, అభయాంజనేయస్వామి ఆలయం, సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయాలు నిర్మించారు. సూర్యదేవాలయాన్ని చిన జీయర్ స్వామి ప్రారంభించారు. ఏటా రథసప్తమికి వేల మంది భక్తులు తరలివచ్చి సూర్యభగవానుడిని దర్శించుకుంటారు.

> **దాతల సహకారం మరువలేనిది**
>
> వివేకానంద మహారోగి ఆరోగ్యకేంద్రంలో కుష్టు వ్యాధిగ్రస్తుల పునరావాస కేంద్రం 49 ఏళ్లు, వివేకానంద చారిటబుల్ క్లినిక్ 24 ఏళ్లు విజయవంతంగా పూర్తి చేసుకున్నాయి. దీనికి రాజమహేంద్రవరం, పరిసర ప్రాంత దాతల సహకారం మరువలేనిది. బాధితులకు సేవలందించేందుకు, ప్రజల వైద్యానికి సహకరిస్తున్న ప్రతి ఒక్క దాతకూ ధన్యవాదాలు.
>
> – ఓలేటి సత్యనారాయణ, ప్రకల్ప సంయోజకులు, వివేకానంద మహారోగి ఆరోగ్య కేంద్రం, బొమ్మూరు

క్లుప్తంగా

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో కుట్టు, మగ్గం, కంప్యూటర్లలో ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, ఆసక్తి కలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుట్టు, మగ్గం శిక్షణకు కనీసం ఏడో తరగతి చదివి ఉండాలని, కంప్యూటర్ నేర్చుకోవాలనుకునే వారికి ఇంటర్మీడియెట్ అర్హత అన్నారు. 45 రోజుల పాటు జరిగే శిక్షణలో ఉచితంగా మెటీరియల్, మధ్యాహ్నం భోజనం అందజేసి, నైపుణ్యం గల ఉపాధ్యాయులతో శిక్షణ అందిస్తామన్నారు. ఆసక్తి కలవారు 98498 47489 ఫోన్ నంబర్‌ను, లేదా లాలాచెరువులోని స్వర్ణాంధ్ర సేవాసంస్థను సంప్రదించాలన్నారు.

గంగమ్మ తల్లికి పూజలు


గంగమ్మ ప్రతిమకు నమస్కరిస్తున్న సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్

సీటీఆర్ఐ: సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. కోటిలింగాల పేటలో శివరామ రజక సంక్షేమ అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో జరిగిన బల్లల పండగకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గంగమ్మ తల్లి ప్రతిమకు పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రజకులు తమకు అన్నం పెట్టే ఆ బండకు జనవరిలో 15 రోజుల పాటు పూజలు చేస్తారని, దీనినే బల్లల పండగగా పిలుస్తారన్నారు.

పోలీసు సిబ్బందితో సమీక్ష


పోలీసు సిబ్బందితో మాట్లాడుతున్న ఏఎస్పీ మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ రెడ్డి

కంబాలచెరువు: వివిధ కేసులకు సంబంధించి జిల్లా పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) ఎన్‌బీఎం మురళీకృష్ణ, ఇన్‌స్పెక్టర్ (డీసీఆర్‌బీ) పవన్ కుమార్ రెడ్డి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి కోర్టు కానిస్టేబుళ్లు, హెడ్‌కానిస్టేబుళ్లు హాజరయ్యారు. అరెస్టు, రిమాండ్, పెండింగ్ కేసులు తదితర వాటికి సంబంధించి సమస్యలను అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలను వారిని వివరించారు.

అడ్వాన్స్‌డ్ గ్రో హెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్ ప్రారంభం


క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్, ఫౌండర్ శరణ్ వెల్ జే

రాజమహేంద్రవరం సిటీ: దానవాయిపేటలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్‌డ్ గ్రో హెయిర్ అండ్ గ్లోస్కిన్ క్లినిక్‌ను సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్లినిక్‌కు విశ్వసనీయత ఉండబట్టే రాష్ట్రంలో 15 బ్రాంచీలు నెలకొల్పారని అభినందించారు. ఫౌండర్, ఎండీ శరణ్ వెల్ జే మాట్లాడుతూ అందాన్ని మెరుగుపర్చడానికి అత్యుత్తమ చికిత్స అందించడంలో తమ క్లినిక్ ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సర్వీసు అందించడమే లక్ష్యమన్నారు. జుట్టు మళ్లీ రావడంలో, చర్మం పునరుజ్జీవనం కోసం అత్యుత్తమ చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతి వస్తున్నాం
సూర్యమినీ	: దేవా
సూర్యప్యాలెస్	: ప్రేమిస్తావా, మదగజరాజు
స్వామి	: సంక్రాంతికి వస్తున్నాం
శివజ్యోతి	: గేమ్‌ఛేంజర్
అనుశ్రీ	: మదగజరాజు
రాజా	: మదగజరాజు
ఊర్వశి	: పుష్ప–2
మేనక	: మహిష
రంభ	: స్కైఫోర్స్
కుమారి	: రాచరికం (మార్నింగ్ షో), పుష్ప–2 (2 షోలు)
అప్సర	: డాకు మహారాజ్
అశోక	: డాకు మహారాజ్
నామవరం	
వీఎస్ మహల్	: సంక్రాంతికి వస్తున్నాం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: సంక్రాంతికి వస్తున్నాం
కడియం	
వెంకటసూర్య	: సంక్రాంతికి వస్తున్నాం

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి


న్యాయవాదులకు పోస్టర్లు పంపిణీ చేస్తున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి రాజబాబు

సీటీఆర్ఐ: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో తనను గెలిపిస్తే సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమిస్తానని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల స్వతంత్ర అభ్యర్థి శెట్టిబత్తుల రాజబాబు అన్నారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం కోర్టు ప్రాంగణంలో శనివారం పలువురు న్యాయవాదులను కలిసి, తనకు మద్దతు తెలిపాలని అభ్యర్థించారు. తొలుత రాజమండ్రి బార్ అసోసియేషన్ కార్యదర్శి పెల్లూరి రమేష్‌కు పోస్టర్ అందజేశారు. రాజబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను తొంగలో తొక్కిందన్నారు. అధికారంలోకి రావడానికి అనేక అబద్ధపు హామీలు ఇచ్చారన్నారు. ఇప్పుడు పట్టభద్రుల ఎమ్మెల్సీ విషయంలో కూడా అనేక ప్రలోభాలకు పాల్పడుతున్నారని తెలిపారు. విజ్ఞత కలిగిన మేధావులు ఆలోచించి.. ఈ నెల 27న జరిగే ఎన్నికల్లో తనకు ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో న్యాయవాదులు ఇసుకపట్ల రాంబాబు, తప్పెట్ల పృథ్వీరాజ్, కొల్లాపు వేణు, ఏ.ఆనంద్ కుమార్, వై.భవాని, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మెమరీ టెక్నిక్‌లపై అవగాహన

కంబాలచెరువు: జ్ఞాపక శక్తిని పెంపొందించుకునేందుకు కొన్ని మెళకువలు ఉన్నాయని ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ మెమెరీ ట్రైనర్ జీవీ శివనారాయణ అన్నారు. స్థానిక నాగరాజా నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం మెమరీ టెక్నిక్‌లను తెలియజేశారు. చదివిన విషయాలను ఎలా గుర్తుపెట్టుకోవాలి, సునాయాసంగా జవాబులు రాసే విధానాలను తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.చక్రధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోదావరిలో మహిళ మృతదేహం

కంబాలచెరువు: స్థానిక పుష్కరాల రేవు వద్ద గోదావరిలో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని మూడో పట్టణ పోలీసులు శనివారం గుర్తించారు. నదిలో మృతదేహం తేలియాడుతోందని స్థానికులు తెలిపిన సమాచారంతో ఆ ప్రాంతానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. అయితే ఆమెకు సంబంధించి ఎటువంటి వివరాలు దొరకలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

బిక్కవోలు: స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం వద్ద ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సభ్యుడు జంగా విహారి శనివారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శ్రీ కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. స్థానికులే కాక చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సైతం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. హాజరయ్యేవారు ఆధార్ కార్డు జిరాక్స్‌తో పాటు పాత మెడికల్ రిపోర్టులు వెంట తీసుకురావాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు సమస్యలు వివరిస్తున్న ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సభ్యులు

కంబాలచెరువు: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి సూపరింటెండెంట్, అడిషనల్ డైరెక్టర్ సూర్యప్రభను శుక్రవారం ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కోరింది. ఈ సందర్భంగా సంఘ సభ్యులు కొన్ని ప్రధానమైన సిబ్బంది సమస్యలపై చర్చించారు. త్వరలోనే పూర్తిస్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సూపరింటెండెంట్ హామీ ఇచ్చారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తరపున పి.గిరిప్రసాద్ వర్మ, జిల్లా అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు పులిదిండి రవికుమార్, జిల్లా కోశాధికారి పి.రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గం ఆదివారం కాకినాడలో జరగబోవు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబువి సూపర్ ఫ్లాప్ హామీలు


విలేకరులతో మాట్లాడుతున్న విశ్వేశ్వర రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు.. ప్రస్తుతం సూపర్ ఫ్లాప్ హామీలుగా మారాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పాలన చేపట్టి 7 నెలలు పూర్తయినా ఒక్క హామీ అమలు కాలేదన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక విడత కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు. అలాగే ఏడు నెలల కాలంలోనే రూ.17 వేల కోట్ల విద్యుత్ బిల్లుల భారాన్ని సామాన్యులపై మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ఉద్దేశంతో సంపద సృష్టించడం అంటే సామాన్యులపై భారం మోపడమేనన్నారు. ఆ విషయం చంద్రబాబు చర్యలతో అర్థమవుతోందంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు బాదుడే బాదుడు కార్యక్రమాన్ని తూ.చ తప్పకుండా అమలు చేస్తున్నారని, ప్రజలు చంద్రబాబు పాలనపై కళ్లు తెరవాలంటూ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్నాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం విజయ కుమారి సేవలు అభినందనీయం


విజయ కుమారి దంపతులను సత్కరిస్తున్న ఎంఈవోలు, తదితరులు

కడియం: మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల –2 ప్రధానోపాధ్యాయురాలు విజయ కుమారి సేవలు అభినందనీయమని ఎంఈవో–1 మణి కుమార్ కొనియాడారు. విజయ కుమారి ఉద్యోగ విరమణ సందర్భంగా ఆ పాఠశాలలో శనివారం అభినందన సభ ఘనంగా నిర్వహించారు. విజయ కుమారి దంపతులను టీడీపీ కడియం మండల అధ్యక్షుడు వెలుగుబంటి రఘురామ్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి తదితరులు సత్కరించారు. 42 ఏళ్ల పాటు విద్యారంగంలో ఆమె అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో–2 నాగేశ్వరరావు, విశ్రాంత ఎంఈవో లజపతి రాయ్, కడియం హైస్కూల్ హెచ్‌ఎం సత్యనారాయణ, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, జిల్లా ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సబ్బతి శ్రీనివాస్, నరేష్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు చిలుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో విప్లవాత్మక మార్పులు


సదస్సులో మాట్లాడుతున్న చైతన్య రాజు

రాజానగరం: 'ఇంజినీరింగ్ అండ్ వైద్యశాస్త్రలలో కృత్రిమ మేధస్సు ఆధారిత ఆవిష్కరణలు' అనే అంశంపై గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ)లో శనివారం అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా జీఎఫ్ఐ బోర్డు సభ్యురాలు డాక్టర్ లీలా రాజు మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో కృత్రిమ మేధస్సు విప్లవాత్మక మార్పులను తీసుకురానుందన్నారు. స్మార్ట్ ఫోన్ అప్లికేషన్ల ద్వారా అప్తమాలజీలో ఫొటోలు తీసి, పెద్ద సంఖ్యలో రోగులకు నేత్ర పరీక్షలు నిర్వహించేందుకు అవకాశం ఉంటుందన్నారు. న్యూయార్క్ వెల్ కార్నెల్ వైద్య కళాశాల అప్తమాలజీ క్లినికల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఛాన్స్ ఏ కోల్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు సహాయంతో గ్లకోమా వంటి కంటి వ్యాధులను త్వరితంగా నిర్ధారించవచ్చని తెలిపారు. జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ విల్మర్ఐ ఇన్‌స్టిట్యూట్ ప్రొఫెసర్ డాక్టర్ థామస్ జాన్సన్ మాట్లాడుతూ కంటి వైద్యంలో స్టెమ్‌సెల్ టెక్నాలజీ కీలక పాత్ర వహిస్తుందన్నారు. కంటి శస్త్ర చికిత్సలలో ఆధునిక కృత్రిమ మేధస్సు పరిజ్ఞాన ఎలా ప్రభావం చూపుతుందో వివరించారు. ఆస్ట్రేలియాలోని ప్రకృతి విపత్తుల నివారణ శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణ నడింపల్లి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల వలన కలిగే నష్టాలను అంచనా వేసేందుకు అత్యాధునిక డేటా అనలిటిక్స్, కృత్రిమ మేధస్సు మోడళ్లను ఏవిధంగా ఉపయోగించాలో అవగాహన కలిగించారు. జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్య రాజు) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, డాక్టర్ టీవీ ప్రసాద్, డాక్టర్ ఆర్ఎస్ రాజు, రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంఎంఎస్ శర్మ, ప్రిన్సిపాళ్ల డాక్టర్ టి.జయానందకుమార్, డాక్టర్ కె.వల్లీమాధవి, డాక్టర్ పీజీ రామానుజం పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్లు లేకుంటే వాహనాల సీజ్


రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సీఐ సత్య కిషోర్

సీతానగరం: నంబర్ ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేస్తామని కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యకిషోర్ హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వ నిర్వహిస్తున్న రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లు, వాహన చోదకులకు తవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహన ప్రమాదాల కారణంగా పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాన్ని నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్ తదితర కారణాలు దీని వెనుక ఉన్నాయని తెలిపారు. వాహన చోదకులు తప్పని సరిగా డ్రైవింగ్ లైసెన్స్ పొంది ఉండాలని, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనం నడపరాదన్నారు. ఎస్సై డి.రామ్ కుమార్ మాట్లాడుతూ వాహన చోదకులు హెల్మెట్ ధరించాలని, కారులో సీట్ బెల్ట్ పెట్టుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదన్నారు.

బాటలపై బూటకం

- సంక్రాంతి వచ్చి, వెళ్లిపోయింది
- మరమ్మతులకు నోచుకోని రహదారులు
- గాల్లో కలిసిన సీఎం చంద్రబాబు హామీ
- రాకపోకలకు ప్రజల అవస్థలు


రాపాకలో అధ్వానంగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు

సీతానగరం: '' నగరాల్లో స్థిరపడిన వారు, ఎన్నారైలు సంక్రాంతి పండక్కి సొంత ఊళ్లకు వచ్చే నాటికి రోడ్లన్ని కళకళలాడాలి. మన ఊరి రోడ్లు బాగుపడ్డాయని అందరూ సంతోషించాలి'' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు సందేశం ఇచ్చారు. సంక్రాంతి వచ్చింది, అందరూ సొంత ఊళ్లకు వచ్చారు, పండగ అనంతరం తిరిగి వెళ్లిపోయారు. కానీ రోడ్లు మాత్రం కనీస మరమ్మతులకు నోచుకోలేదు. ఫలితంగా రోడ్లపై ప్రయాణం వాహనచోదకులకు నిత్యం నరకాన్ని చూపిస్తోంది. సీతానగరం మండలంలోని పలు రోడ్లు అధ్వానంగా మారడంతో రాకపోకలు ప్రజలు అవస్తలు పడతున్నాయి.

ఏటిగట్టు రోడ్డు

సీతానగరం – పురుషోత్తపట్నంలో పంచాయత్‌రాజ్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన ఏటిగట్టు రోడ్డు అతి ప్రధానమైంది. ఈ రోడ్డు మీదుగానే పాపికొండల పర్యాటకులు తరలివెళుతుంటారు. నిత్యం ప్రైవేటు బస్సులు, కార్లు, ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన సామగ్రిని భారీ వాహనాలపై తరలిస్తూ ఉంటారు. ఈ నేపథ్యంలో పది కిలోమీటర్ల మేర ఏటిగట్టు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి.

బూడిదతో అవస్థలు

గత సీజన్‌లో కురిసిన వర్షాలకు రోడ్డు మరింత దారుణంగా తయారైంది. దానికి తోడు పోలవరం ప్రాజెక్టును కాంట్రాక్ట్ తీసుకున్న మెగా కంపెనీ ఈ పది కిలోమీటర్ల రోడ్డుపై పడిన గోతుల్లో క్వారీ బూడిదను వేసింది. దీంతో భారీ వాహనం వెళితే విపరీతంగా బూడిద లేచిపోతోంది. వెనుక వచ్చే వాహనాలకు దారి కనిపించడం లేదు. దీనివల్ల పలు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. గత నెలలో సింగవరానికి ఓ యువకుడు స్కూటీపై రామచంద్రపురం జగనన్న కాలనీలో బంధువుల ఇంటికి వెళుతున్నాడు. ఈ రోడ్డుపై గోతులను తప్పించే క్రమంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొని గాయాల పాలై, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రాపాక – కోటికేశవరం రోడ్డు

రాపాక – కోటి కేశవరం ఆర్ అండ్ బీ రోడ్డులో కొంత వరకు మరమ్మతులు చేసి మమ అనిపించారు. రాపాక నుంచి మూడు కిలోమీటర్లు తారురోడ్డుపై పడిన గోతులను అలాగే వదిలేశారు. రాపాకకు మూడు కిలోమీటర్ల దూరం నుంచి కోటికేశవరం వరకు రోడ్డుపై పడిన గోతులను పూడ్చారు. రాపాక నుంచి రైతులు తమ వాహనాలపై ఎరువుల బస్తాలను తమ పొలాలకు తరలించడానికి ఇబ్బందులకు గురవుతున్నారు.

కాతేరు– సీతానగరం రహదారి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు నుంచి సీతానగరం వరకు నాలుగు లైన్ల రోడ్డు రఘుదేవపురం శివారు వరకూ పూర్తయ్యింది. అక్కడి నుంచి సీతానగరం వరకూ జరగాల్సిన పనులకు అసెంబ్లీ ఎన్నికల కోడ్‌తో బ్రేక్ పడింది. ఎన్నికలు పూర్తయ్యాయి, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. కానీ ఈ రోడ్డు సంగతిని మర్చిపోయారు. గోతుల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. నాలుగు లైన్ల రోడ్డులో మునికూడలి, కాటవరం, ముగ్గళ్ల కల్వర్టుల వద్ద రోడ్డును కలపాల్సి ఉన్నా, దాన్ని కూడా అధికారులు పట్టించుకోకపోవడంతో వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.